సాక్షి
కాకినాడ
గురువారం। 2। ఫిబ్రవరి। 2023



నిత్యాన్నదానానికి రూ.1,02,222 విరాళం


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి మలికిపురానికి చెందిన కె.సూర్యకాంతం కుటుంబీకులు బుధవారం రూ.1,02,222 విరాళం అందజేశారు.

SAKSHI PREMIER

హోరాహోరీ

గైట్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. -18లో

డెల్టాలకు 5,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 5,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,760, మధ్య డెల్టాకు 1,145, పశ్చిమ డెల్టాకు 3,065 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.55 అడుగులకు చేరింది.

రథ సంబరం.. జన సందరం..

- సోదరి గుర్రాలక్కకు చీర, సారె సమర్పణ
- అంతర్వేదిలో పోటెత్తిన భక్తులు



అంతర్వేది నరసన్న రథోత్సవం

భీష్మ ఏకాదశి పర్వదినాన తూర్పున ఆధ్యాత్మికత వెలుగులీనింది. కల్యాణ క్రతువులు, రథయాత్రల పరుగులతో జన సంద్రం పులకించింది. అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి రథోత్సవం, ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమనాథుని కల్యాణం, జి.మామిడాడ సూర్యనారాయణుని రథోత్సవం, కల్యాణం, ధవళగిరి జనార్దన స్వామివారి కల్యాణం రథోత్సవం, అన్నవరం సత్యదేవుని దర్శనానికి పోటెత్తిన భక్తులు. ఇలా ఎక్కడ చూసినా భక్తి పరవళ్లు తొక్కింది.

సాక్షి అమలాపురం/సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి రథయాత్ర అపూర్వంగా సాగింది. అసంఖ్యాకమైన భక్తుల గోవింద నామ స్మరణలు, నరసింహస్వామికి జై జై నినాదాల మధ్య రథయాత్ర సాగింది. మధ్యాహ్నం రెండు గంటలకు మొగల్తూరుకు చెందిన ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహద్దూర్, ముఖ్య అతిథిగా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద రావు, కొబ్బరికాయలు కొట్టి రథయాత్రకు శ్రీకారం చుట్టారు. స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి పల్లకిలో రథం వద్దకు తోడ్కొని వచ్చారు. భక్తులు రథానికి అరటి గెలలు, గుమ్మడికాయలు కట్టించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి రథయాత్ర మెరక వీధి నుంచి మొదలై గుర్రాలక్క ఆలయం వరకు చేరుకుని తిరిగి అక్కడ నుంచి పల్లపు వీధిలోని 16 కాళ్ల మంటపానికి చేరుకుంది. మార్గ మధ్యంలో గుర్రాలక్కకు చీర, సారె ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస్ కిరణ్ ఆధ్వర్యంలో అర్చకులు అందజేశారు. స్వామి కల్యాణం ముగిశాక బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు సముద్ర స్నానానికి పోటెత్తారు. పెద్దలకు పిండ ప్రదానాలు చేశారు. స్వామి దర్శనానికి బారులు తీరారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణ క్రతువు

పెదపూడి: గోవింద నామస్మరణ నడుమ జి.మామిడాడలోని ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామివారి కల్యాణం బుధవారం రాత్రి 8.30 గంటలకు వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో 20 మంది పండితులు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. భక్తుల సందడితో ఈ వేడుక నయన మనోహరంగా సాగింది. మధ్యాహ్నం 1.05 గంటలకు స్వామివారి రథోత్సవాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి ప్రారంభించారు. దేశంలోనే ఏకైక వైష్ణవ సంప్రదాయ సూర్యదేవాలయంగా జి.మామిడాడలోని సూర్యదేవాలయం భాసిల్లుతోంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొవ్వూరి శ్రీనివాస బాలకృష్ణారెడ్డి దేవదాయ శాఖ తరఫున పట్టు వస్త్రాలను సమర్పించారు.

కమనీయం భీమనాథుని కల్యాణం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారి కల్యాణం బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణస్వామి, ఛండికా సమేత సూరేశ్వరస్వామివారి దివ్య కల్యాణాన్ని ఒకే వేదికపై తిలకించి భక్తులు పరవశులయ్యారు. ఈఓ పితాని తారకేశ్వరరావు నేతృత్వంలో దేవస్థానం బ్రహ్మ దేవులపల్లి ఫణిరామకృష్ణ, ఆలయ వైదిక బృందం ఆధ్వర్యంలో ఉదయం కల్యాణమూర్తులను గావించిన అనంతరం ఆలయంలో ఎదురు సన్నాహాలతో కల్యాణ క్రతువు ప్రారంభమైంది. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం గావించారు. నంది వాహనంపై స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. మృగశిర నక్షత్రయుక్త మీన లగ్నంలో రాత్రి 10.25 గంటలకు మాంగల్య ధారణ చేయించారు. టీటీడీ నుంచి వచ్చిన పట్టు వస్త్రాలను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సతీమణి వరలక్ష్మి సమర్పించారు.

ధవళేశ్వరం: జనార్దన స్వామివారి రథోత్సవం, కల్యాణోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగాయి.



జి.మామిడాడలో కన్నుల పండువగా సాగిన రథోత్సవం



ధవళేశ్వరంలో సాగిన జనార్దనస్వామి రథోత్సవం

కిక్కిరిసిన రత్నగిరి

అన్నవరం: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం సత్యదేవుని సన్నిధికి వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. సుమారు 80 వేల మంది తరలిరావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మంటపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. మంగళవారం తెల్లవారుజామున ఒంటిగంట నుంచి వ్రతాల నిర్వహణ ప్రారంభించారు. స్వామివారి దర్శనానికి అనుమతించారు. ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, సాధారణ దర్శనానికి గంట పట్టింది. భక్తులకు నిత్యాన్నప్రసాద పథకంలో పులిహోర, దద్దోజనం అందజేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సత్యనారాయణమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రామాలయం వద్ద గల విశ్రాంతి మంటపం వద్ద చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఒక్కరోజే దేవస్థానానికి రూ.80 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 8,171 జరిగాయి.



జి.మామిడాడలో సూర్యనారాయణమూర్తి కల్యాణంలో జీలకర్ర బెల్లం చూపిస్తున్న అర్చకుడు



ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



అన్నవరంలో సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

వేతన జీవులకు మోదం.. ఖేదం

- కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపన్నుపై ఉద్యోగుల్లో భిన్నాభిప్రాయాలు
- సవరించిన ఆదాయ పన్నులపై వ్యక్తమవుతున్న సానుకూలత

సాక్షిప్రతినిధి, కాకినాడ: కేంద్ర బడ్జెట్ మధ్యతరగతి, ఉద్యోగ వర్గాలకు కాస్త ఊరటనిచ్చింది. తమ వ్యక్తిగత ఆదాయ పన్నుల్లో చేసిన మార్పులను ఉద్యోగ వర్గాలు స్వాగతిస్తున్నాయి. పన్ను రాయితీ పరిమితిని రూ.7 లక్షల వరకు పొడిగించడాన్ని హర్షిస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 65వేల మంది ఉద్యోగులు, 39వేల మంది పెన్షనర్లకు శుభపరిణామంగా ఈ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. జిల్లా పూర్తిగా వ్యవసాయాధారితమైంది. పంట రుణాల లక్ష్యాన్ని ఈసారి 11 శాతానికి పెంచడం కలిసొచ్చే అంశమని రైతు సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. అలాగే స్వల్పకాలిక పంట రుణాలను ఏడు శాతం వడ్డీ రేటుకే అందజేయాలని నిర్ణయించడం మంచి పరిణామమంటున్నారు. తనఖా లేని రుణ పరిమితిని రూ.1లక్ష నుంచి రూ.1.60 లక్షలకు పెంచడం కొంత చేయూతనిస్తుందంటున్నారు. దీనివల్ల సుమారు ఐదు లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. రూ.6000 కోట్ల పెట్టుబడి లక్ష్యంతో ప్రధానమంత్రి



మత్స్య సంపద అనే కొత్త పథకాన్ని తీసుకురావడం వల్ల కాకినాడ..కోనసీమ జిల్లాల్లోని సుమారు 2 లక్షల మత్స్యకార కుటుంబాలకు మేలు కలగనుంది. జిల్లాలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు మోక్షం లభించే అవకాశాలున్నాయని రైల్వే సాధన సమితి ప్రతినిధులు విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు పెండింగ్ సమస్యలకు బడ్జెట్‌లో చోటు దక్కలేదని ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు, మంజూరైన వైద్య కళాశాలలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడాన్ని తప్పుబడుతున్నారు.

అంత ఆశాజనకంగా లేదు



ఉద్యోగుల ఆదాయపు పన్ను సడలింపు ఆశాజనకంగా లేదు. చిన్న, కింది స్థాయి ఉద్యోగులకు తప్ప సీనియార్టీ ఉన్న వారికి ఉపకరించదు. ఇప్పటికే పన్నుల రూపంలో 45 రోజుల జీతం చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద జీతం తీసుకుని కేంద్ర ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నాం. ఆదాయపు పన్ను సడలింపులో రూ.లక్షకు పైగా జీతం తీసుకునే ఉద్యోగులకు ఏమాత్రం ప్రయోజనం లేదు.

- పసుపులేటి శ్రీనివాసు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ ఎన్‌జీవో.

పెన్షనర్లకు ప్రయోజనమేదీ..



కేంద్ర బడ్జెట్‌లో పెన్షనర్లకు సంబంధించి శ్లాబ్ రేటు రూ.5 లక్షల నుంచి రూ. 7 లక్షలకు పెంచడం హర్షణీయమే. కానీ గతంలో వయ సు ఆధారంగా శ్లాబ్ కేటాయించారు. ఇప్పుడు అలాంటిది లేకుండా రూ.7 లక్షలకు పెంచినట్లు ప్రకటించారు. కొంత గందరగోళ పరిస్థితి కన్పిస్తోంది. పెన్షనర్స్‌కు ఎటువంటి కేటాయింపులు లేవు.

- కె.పద్మనాభం, అధ్యక్షుడు, పెన్షనర్ల అసోసియేషన్

చిన్న, మధ్య తరహా ఉద్యోగులకు ఊరట



చిన్న, మధ్య తరహా ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలకు ట్యాక్స్ రిబేట్ పెంపుతో కొంత ఊరట కలుగుతుంది. ఆదాయపు పన్ను శ్లాబ్ రేట్లు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షలకు, రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచడం వల్ల మధ్యతరగతి ఉద్యోగులు, వ్యాపారస్తులకు మంచి ఉపయోగకరం. వ్యవసాయ కో ఆపరేటివ్ సొసైటీలు, మిల్క్ సొసైటీలకు గతంలో సొమ్ము డ్రా చేసుకునే సమయంలో టీడీఎస్ ఇబ్బంది ఉండేది. ఇప్పుడు అది లేకుండానే రూ.3 కోట్ల వరకూ డ్రా చేసుకోవచ్చు.

- ఎంఎస్ఎస్ జగదీష్, చార్టర్డ్ అకౌంటెంట్, కాకినాడ.

బడ్జెట్ వెసులుబాటే



ఉద్యోగులకు రూ.7 లక్షల వరకూ పన్ను లేకుండా చేయడం మంచిదే. రూ.7 లక్షలు దాటినా నాలుగైదు శ్లాబ్‌లు పెట్టడంతో పన్ను చెల్లింపు కొంత ఉపశమనంగా ఉంటుంది. ఎలక్ట్రానిక్ వస్తువులపై కొంత ధరలు తగ్గించారు. మొబైల్ ఫోన్లు, టీవీలు వంటి ఎలక్ట్రానిక్ గూడ్స్ ధరల పరంగా సామాన్యుడికి మంచి జరుగుతుంది. రైల్వే బడ్జెట్ విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. గతం కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ మొత్తాన్ని కేటాయించడంతో ఈసారి కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైన్‌కు నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నాం.

- వక్కలంక కృష్ణమోహన్, విశ్రాంత ప్రిన్సిపాల్, అమలాపురం.

వ్యాపార వర్గాలకు నిరాశ



జీఎస్టీ రూ.లక్ష కోట్లు దాటితే 18 శాతం జీఎస్టీ నుంచి ఐటమ్స్ తగ్గిస్తామన్నారు. కానీ తగ్గించలేదు. ఇప్పుడున్న రూ.50లక్షలు అబ్జెక్షన్‌ను కనీసం కోటి రూపాయలు చేయాలన్నాం. జీఎస్టీ నుంచి మినహాయింపు అడిగాము. వ్యాపారస్తులకు అదికూడా చేయలేదు. జీఎస్టీ పరిధిని కోటి రూపాయలు చేయాలని కోరాము. ఈ రెండు చేయకపోవడం వల్ల నిరాశ కలిగింది.

- మద్దుల మురళీకృష్ణ, సెక్రటరీ, రాజమహేంద్రవరం చాంబర్ ఆఫ్ కామర్స్



ప్రతి ఎకరానికీ నీరు అందాలి : ఎమ్మెల్యే కురసాల

నీటిపారుదల అధికారులతో సమీక్ష

కాకినాడ రూరల్: నీటి పారుదలశాఖ అధికారులతో బుధవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమీక్షించారు. రబీ సీజన్‌లో నియోజకవర్గంలో శివారు ఆయకట్టుకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏప్రిల్ 15 లోగా ఈ రబీ సీజన్ పూర్తి అవుతుందని అంచనా వేస్తున్నట్టు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. సీలేరు నుంచి అదనపు నీరు విడుదల చేయకపోతే ఇబ్బందేనని ప్రభుత్వానికి లేఖ రాసినట్టు ధవళేశ్వరం నీటిపారుదలశాఖ ఎస్ఈ జి.శ్రీనివాసరావు వివరించారు. ప్రతి ఎకరాకి నీరు అందాలని సీఎం ఆకాంక్ష అని, అవసరమైతే పీక్ సీజన్లో ఆయిల్ ఇంజిన్లతో నీరు అందించాలని సూచించారు. అలాగే పోలవరం బ్యారేజీకి గేట్లు నిర్మించడం వలన కొంత నీరు నిలబడుతుందని, ఆ జలాలను ఎలా వినియోగించుకోవాలో ఆలోచించాలని అధికారులకు చెప్పారు. ధవళేశ్వరం నీటిపారుదలశాఖ ఎస్ఈ జి.శ్రీనివాసరావు , ఏఈలు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్‌ఎంసీ తనిఖీలు

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) బుధవారం తనిఖీలు చేపట్టింది. 12 రాష్ట్రాలకు చెందిన 12 మంది సభ్యుల బృందం వివిధ వైద్య విభాగాలకు సంబంధించి పీజీ సీట్ల కేటాయింపులకు సాధ్యాసాధ్యాలను పరిశీలించింది. మొత్తం 14 స్పెషాలిటీలలో 65 పీజీ సీట్ల కేటాయింపు, పెంపుదల కోసం విన్నవించినట్లు ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. తనిఖీల నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్లు రంగరాయలోని వివిధ విభాగాలతో పాటు జీజీహెచ్‌లోని ఆర్థోపెడిక్స్, రేడియాలజీ, రేడియో థెరపీ, ఈఎన్‌టీ, ఆప్తాల్మాలజీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ తదితర క్లినికల్ విభాగాలు, మైక్రోబయాలజీ, పాథాలజీ, ఫోరెన్సిక్ మెడిసన్ వంటి పారా క్లినికల్ విభాగాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ నివేదికను ఢిల్లీ కేంద్రంగా ఉన్న నేషనల్ మెడికల్ కమిషన్‌కు సమర్పిస్తామని తద్వారా పీజీ సీట్లు కేటాయిస్తారని ఇన్‌స్పెక్టర్లు తెలిపారు.

4న శాప్ అథ్లెటిక్ లీగ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 4న జిల్లా క్రీడామైదానంలో శాప్ అథ్లెటిక్స్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ బుధవారం తెలిపారు. 100, 1600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి క్రీడాకారుడు రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఉదయం 8 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు ఆసక్తి గల వారు ఎంపికలకు హాజరుకావాలన్నారు. 7396500085 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

రూ.600 కోట్లతో జాతీయ రహదారి నిర్మాణం

గోపాలపురం: రూ.600 కోట్ల వ్యయంతో 87 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు భీమవరం జాతీయ రహదారుల ఏఈ ఎస్‌డీ కాజా తెలిపారు. ఈ మేరకు రోడ్డును బుధవారం అధికారులు పరిశీలించారు. జీలుగుమిల్లి నుంచి బుట్టాయగూడెం, కన్నాపురం, పట్టిసీమ మీదుగా కొవ్వూరు వరకూ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. రహదారికి ఇరువైపులా ఉన్న ప్రభుత్వ స్థలం కాకుండా అవసరమైన స్థలాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఈయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.బంగారయ్య, దొండపూడి సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, పోల్నాటి సురేష్ ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నారు.

భర్త, అత్తమామపై కేసు

సామర్లకోట: స్థానిక అయోధ్యరామపురం ప్రాంతానికి చెందిన వల్లభనేని సునీత భర్త ఫణికుమార్, అత్తమామలపై చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ బుధవారం తెలిపారు. భర్త, అత్తమామలు శారీరకంగా, మానసికంగా బాధ పెడుతున్నారనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

హోరాహోరీ

- రసవత్తరంగా సాగుతున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు
- వాకోవర్ కారణంగా గైట్‌లో ఒకే మ్యాచ్ నిర్వహణ

రాజానగరం: గైట్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. నిర్ణీత ఓవర్లలో అధిక పరుగులు తీసి, ప్రత్యర్థులకు భారీ టార్గెట్ ఇచ్చేందుకు ఒక టీమ్ ప్రయత్నిస్తుంటే, వారిచ్చిన టార్గెట్‌ని అవలీలగా చేరుకుని విజయాన్ని సాధించేందుకు మరొక టీమ్ కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో మూడో రోజైన బుధవారం జరిగిన పోటీలలో గైట్ క్రీడా మైదానంలో రెండు మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. అయితే ఒక టీమ్ అవసరమైన రికార్డులను సబ్‌మిట్ చేయకపోవడంతో వాకోవర్ అయింది. ఆ టీమ్‌ని పోటీ నుంచి తొలగించారు. దీంతో ఒకే ఒక్క మ్యాచ్ జరిగింది.

- ఉదయం జరుగవలసిన మొదటి మ్యాచ్‌లో జీఎస్ఎల్ డెంటల్ కళాశాల టీమ్ (రాజానగరం)తో సంహిత డిగ్రీ కళాశాల టీమ్ (రాజమహేంద్రవరం) తలపడవలసి ఉంది. అయితే సంహిత కళాశాల టీమ్ ఐడీ ప్రూఫ్‌లు తీసుకురాకపోవడంతో ఆ టీమ్‌ని పోటీ నుంచి తప్పించారు. దీంతో ఆడకుండానే జీఎస్ఎల్ డెంటల్ కళాశాల టీమ్‌ని అంపైర్ విజేతగా ప్రకటించారు.
- అనంతరం సెకండ్ మ్యాచ్‌గా జీఎస్ఎల్ మెడికల్ కళాశాల టీమ్ (రాజానగరం), గైర్ ఇంజినీరింగ్ కళాశాల టీమ్ (రాజమహేంద్రవరం)లకు నిర్వహించారు. టాస్ గెలిచిన జీఎస్ఎల్ మెడికల్ కళాశాల టీమ్ బ్యాటింగ్‌ని ఎంచుకుని నిర్ణీత 10 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో మహేంద్రరెడ్డి 20 బంతులకు 23 పరుగులు తీయగా, శ్రీను రెండు ఓవర్లలో రెండు వికెట్లు పడగొట్టి, 19 పరుగులిచ్చాడు. అనంతరం బరిలోకి దిగిన గైర్ కళాశాల టీమ్ నిర్ణీత ఓవర్లలో 60 పరుగులే చేయడంతో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల టీమ్ 22 పరుగుల ఆధిక్యతతో విజేతగా నిలిచింది. మహేంద్రరెడ్డిని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ప్రకటించారు.


మొదటి మ్యాచ్‌లో ఆడకుండానే గెలిచిన జీఎస్ఎల్ డెంటల్ కళాశాల టీమ్


రెండో మ్యాచ్ విజేత జీఎస్ఎల్ మెడికల్ కళాశాల టీమ్

- అంపైర్లుగా కె.అంజనీకుమార్, కె.దినేష్‌కుమార్, స్కోరర్‌గా జి.రవితేజ వ్యవహరించారు.

SAKSHI MEDIA GROUP
సాక్షి సాక్షి SAKSHI TV
www.sakshi.com

SPL SAKSHI PREMIER LEAGUE

ఉత్కంఠ 'బరి'తం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో రంగరాయ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు బుధవారం ఉత్కంఠగా జరిగాయి.

- మొదటి మ్యాచ్‌లో ప్రగతి డిగ్రీ కళాశాల, ఐడియల్ ఇంజినీరింగ్ బి జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచిన ప్రగతి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదటి బ్యాటింగ్ చేసిన ఐడియల్ ఇంజినీరింగ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 103 పరుగులు చేసింది. అరుణ్ 15, పవన్ 12 పరుగులు చేశారు. ప్రగతి జట్టులోని బౌలర్ సత్యనారాయణ 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ప్రగతి జట్టు నిర్ణీత ఓవర్లలో 92 పరుగులు చేసి 6 వికెట్లు కోల్పోయింది. జట్టులోని బ్యాట్స్‌మెన్ సత్య 31, స్వామి 12, మురళి 16, సుధీర్ 19 పరుగులు చేశారు. ఐడియల్ జట్టు 10 పరుగుల తేడాతో విజయం సాధించింది.
- రెండో మ్యాచ్‌లో ఐడియల్ ఇంజినీరింగ్ ఏ, ఆదర్శ ఇంజినీరింగ్ జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచిన ఐడియల్ జట్టు 139 పరుగులు సాధించింది. శ్రీకర్ 22, చైతన్య 23 పరుగులు చేశారు. అనంతరం 140 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఆదర్శ జట్టు నిర్ణీత ఓవరల్లో 87 పరుగులు చేసి 2 వికెట్లు కోల్పోయింది. అనీల్ 27, రవి 23 పరుగులు చేశారు. ఐడియల్ జట్టులోని బౌలర్ కిరణ్ 15 పరుగులు చేసి 2 వికెట్లు తీసుకున్నాడు. 51 పరుగులు తేడాతో ఐడియల్ ఏ జట్టు విజయం సాధించింది.
- మూడో మ్యాచ్‌లో పీవీఆర్ ట్రస్ట్ డిగ్రీ కళాశాల, ఆదిత్య ఇంజినీరింగ్ సూరంపాలెం జట్లు తలపడ్డాయి. పీవీఆర్ ట్రస్ట్ కళాశాల జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ తీసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఆదిత్య ఇంజినీరింగ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 102 పరుగులు చేసి 6 వికెట్లు కోల్పోయింది. జట్టులోని బ్యాట్స్‌మెన్ ఆదిత్య 56 పరుగులు చేసి నాటౌట్‌గా నిచిచాడు. పీవీఆర్ జట్టులోని నవనీత్ 10 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన పీవీఆర్ జట్టు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. 19 పరుగుల తేడాతో ఆదిత్య ఇంజినీరింగ్ జట్టు విజయం సాధించింది. పీవీఆర్ జట్టులోని బ్యాట్స్ మెన్ సంతోష్ 34, గణేష్ 16 పరుగులు చేశారు. బుధవారం నిర్వహించిన మ్యాచ్‌లను 'సాక్షి' సీనియర్ యాడ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, టోర్నీ రిఫ్రెష్‌మెంట్స్ స్పాన్సరర్ టి.హరిష్ తిలకించారు. క్రికెట్ కోచ్ చార్లి మ్యాచ్‌లను పర్యవేక్షించారు.


మొదటి మ్యాచ్ విజేత ఐడియల్ ఇంజినీరింగ్ బి జట్టు


రెండో మ్యాచ్ గెలిచిన ఐడియల్ ఇంజినీరింగ్ ఏ జట్టు


మూడో మ్యాచ్‌లో సత్తా చాటిన ఆదిత్య ఇంజినీరింగ్ సూరంపాలెం జట్టు

ఎవరూ లేని సమయం చూసి ఇంట్లో చోరీ


చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

పిఠాపురం: ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకుని చోరీ చేసిన ఘటన పిఠాపురం మండలం రాపర్తిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం రాపర్తికి చెందిన యర్రా సురేంద్రబాబు గత నెల 28న ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వేరే గ్రామం వెళ్లారు. 31వ తేదీన వచ్చి చూడగా ఇంటి వెనుక వైపు తలుపులు పగులగొట్టి ఉండడంతో పాటు ఇంట్లో ఇనుప బీరువా తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరించారు. బీరువాలో పెట్టిన బంగారు నెక్లెస్, చిన్న బంగారు ఆభరణాలు 4, లక్ష్మీదేవి లాకెట్, వెండి గ్లాసు, వెండి కుందులు, వెండి అక్షింతల గుత్తి చోరీ చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై పిఠాపురం రూరల్ ఎస్సై అబ్దుల్‌నబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


రైల్వే ఫ్లై ఓవర్ వద్ద మృతదేహం

మండపేట: మండలంలోని ద్వారపూడి రైల్వే ఫ్లై ఓవర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రూరల్ పోలీసులు గుర్తించారు. మృతుని వయస్సు 55 నుంచి 60 సంవత్సరాలు, ఎత్తు 5.5 అడుగులు ఉంటుందని, చామన ఛాయ అని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు సెల్ నంబర్ 9440796592కు సమాచారం అందించాలని మండపేట రూరల్ ఎస్ఐ బి.శివకృష్ణ కోరారు.

పాదయాత్ర అంటే షో కాదు

- పవన్..లోకేష్‌ల తీరుపై జూపూడి ఎద్దేవా

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పాదయాత్ర అంటే ప్రజలు కష్టసుఖాలు తెలుసుకుని అండగా ఉండాలని ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం), వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు అన్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇదే తరహాలో చేసి చూపించారన్నారు. ఇప్పుడు నాయకులు చేస్తున్న యాత్రలు షోగా నడుస్తున్నాయని విమర్శించారు. రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాటలు కూడా సరిగా పలకని లోకేష్ పాదయాత్ర ఎందుకు చేస్తున్నాడో అర్థం కావడం లేదన్నారు. తండ్రికి వృద్ధాప్యం వచ్చింది కాబట్టి పాదయాత్ర చేస్తున్నానన్నట్లుగా లోకేష్ పాదయాత్ర సాగుతోందన్నారు. పవన్ కల్యాణ్ వాహనంపై వచ్చి ప్రజలను కలుస్తానని చెబుతున్నాడన్నారు. ఆయన అజెండా రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు ప్రజలు కష్ట సుఖాలు తెలుసుకోవడానికి కాకుండా టీడీపీ మద్దతుగా వాహన యాత్ర చేస్తున్నారని ఆరోపించారు. జగన్ తన పాదయాత్రలో తండ్రి తరహాలో ప్రజల కష్టాలు తెలుసుకున్నారన్నారు. సీఎం అయిన వెంటనే ఆ కష్టాలు తీర్చడానికి అనేక సంక్షేమ పథకాలు చేపట్టారన్నారు. నిరుపేద ప్రజలకు తినడానికి తిండి, కట్టడానికి బట్ట, ఉండటానికి ఇళ్లు ఉండటమే అభివృద్ధి అన్నారు. దానిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అచరణలో అమలు చేస్తూ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా డబ్బులు ఇస్తే వీరికెందుకు బాధ అని విపక్షాలను విమర్శించారు.


సమావేశంలో పాల్గొన్న జూపూడి ప్రభాకరరావు తదితరులు

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మంత్రి రాజా, ఎంపీలు పిల్లి బోస్, గీత, ఎమ్మెల్యేలు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయానికి బుధవారం ఉదయం అట్టహాసంగా భూమిపూజ నిర్వహించారు. కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో రూరల్ నియోజకవర్గం కాకినాడ కార్పొరేషన్ 49వ డివిజన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి దాడిశెట్టి రాజా, రీజినల్ కో-ఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పెండెం దొరబాబు, పర్వత పూర్ణచంద్రప్రసాద్, జ్యోతుల చంటిబాబు పాల్గొని భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన తరువాత ప్రతీ జిల్లాలోను వైఎస్సార్ సీపీ కార్యాలయాలు ఉండాలని తమ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారన్నారు. ఆ విధంగా అన్ని జిల్లాల్లోనూ పార్టీ కార్యాలయాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కాకినాడ జిల్లాకు సంబంధించి నిర్మాణ పనులకుగాను భూమి పూజను ముఖ్యమంత్రి దంపతులు పేరిట నిర్వహించామన్నారు. కార్యకర్తల ఆకాంక్ష మేరకు త్వరితగతిన నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్, కాకినాడ నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్నసాగర్, కాకినాడరూరల్ పరిశీలకులు దున్నా జనార్దనరావు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION
■ టెన్త్, ఇంటర్ పాస్టింగ్ (రెగ్యులర్ ఇంటర్‌లో ఫెయిల్ అయినవారు కట్టుకొనే అవకాశం) డిగ్రీ, పీజీ, (సైన్స్ & ఆర్ట్స్) MBA, B.Li.Sc, M.Li.sc, ఎగ్జామ్స్ అన్నీ మా విద్యాసంస్థల్లో జరుగును. 100% పాస్, మా ఆఫీస్ & కాలేజి కాకినాడ దగ్గరలో గల గొల్లలపాలెం, కాకతీయ విద్యా సంస్థలు. 2023 - 2024 అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫోన్: 98495 82043, అత్రేయపురం ఫోన్: 83414 82043, రాజమండ్రి ఫోన్: 99494 82757 [V-1718]

Real Estate

PLOT FOR SALE
■ కోరకొండ ఊరిలో ఇళ్ళ మధ్య స్థలములు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నవి. గజం కేవలం రూ.7500/-లకే సంప్ర: 78290 01947 [R-5612]
■ కృష్ణాజిల్లా హనుమాన్‌జంక్షన్ దగ్గరలో గల మెగా ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ మల్లవల్లికి చేరువలో 150 & 200 చదరపు గజాల ప్లాట్స్ అమ్మకానికి కలవు. ✆ 83099 39009 [P-B-838]

Services

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర : ✆ 96590 57777 [B-847]

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888 [B-1197739]
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786668]
■ We Release your pledged gold బంగారం బ్యాంకుల్లో ప్రైవేట్ సంస్థల్లో తనఖాలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువుతో, తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-5556]

Wanted
■ కంపెనీలో పనిచేయుటకు స్త్రీ/పు కావలెను. (50) Qly: 7th to Inter, Salary : 10,000/- Job Location : గుంటూరు (100% జెన్యూన్) Contact : 63014 53577 ఇంటర్వ్యూ జరుగుచున్నాయి. [R-1234326]
■ Experienced, Qualified Female Teachers to teach 4th Class all Subjects. Sadhana High School, Tilak St., Kakinada ✆ : 98482 26333 [R-404]
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం, జీ: 16K ఎజెంట్ కమీషన్ 3K. ఫోన్: 7569955551, 9848571888. [H-786829]
■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-10072]
■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp Dr, Q: 5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూ ఫ్రీ, Hyd, Ph: 7995984445 [HA-935]
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779873]

■ AP రిజిస్టర్డ్ మా సంస్థ యందు బ్రాంచ్ మేనేజరు జీ.35వేలు, ఆఫీసు స్టాఫ్ కావలెను. సూపర్‌వైజర్ జీ.20వేలు. అర్హత 10 టు డిగ్రీ, స్త్రీ/పు. ఇం: 2,3,4,5. సెల్ : 88970 49482. [P-1226525]
■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు శరభవరం, శంఖవరం, రౌతులపూడి, మండపం, తేటగుంట, తొండంగి, శృంగవృక్షం, కొత్తపల్లి, ఏ.వి.అన్నవరం, కత్తిపూడి, ప్రత్తిపాడు, ధర్మవరం, చెందుర్తి, తుని, అన్నవరం, కాకినాడ, పెద్దాపురం, రాజమండ్రి, అమలాపురం పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, లేడీ గార్డ్స్ కావలెను. 8 Hrs. డ్యూటీ, 10,000/- శాలరీ మరియు PF & ESI కలదు. Age: 45 Years, Quali: 10th, డిగ్రీ (సూపర్‌వైజర్స్) ✆ : 73822 51616, 94937 85599 [R-402]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి సజీవ దహనం


మంటల్లో కాలిపోయిన మోటారు సైకిల్

సామర్లకోట: కాకినాడ జిల్లా వేట్లపాలెం-మేడపాడు కెనాల్ రోడ్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు సజీవ దహనం అయ్యాడు. బిక్కవోలు నుంచి రాత్రి 10 గంటలకు మోటారు సైకిల్‌పై ముగ్గురు యువకులు కాకినాడ బంధువుల ఇంటికి బయలుదేరారు. మేడపాడు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు సామర్లకోట నుంచి మేడపాడు ఇంటికి తిరిగి వెళుతున్న సమయంలో వేట్లపాలెం శివారు ప్రాంతమైన జోన్నలదొడ్డి దాటిన తరువాత సామర్లకోట నుంచి వస్తున్న మోటారు సైకిలు, బిక్కవోలు నుంచి వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీ కొంది. దాంతో ఒక్కసారి బిక్కవోలు నుంచి వస్తున్న మోటారు సైకిల్ నుంచి మంటలు వ్యాపించాయి. దాంతో మోటారు సైకిల్ నడుపుతున్న బిక్కవోలుకు చెందిన మండపల్లి శేష సాయి గౌతమ్ (19) సజీవ దహనం అయ్యాడు. బిక్కవోలుకు చెందిన ఉదయ్, ఉత్తమ్‌కుమార్ స్వల్పంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. మేడపాడుకు చెందిన వారి వివరాలు తెలియవలసి ఉందన్నారు. క్షతగాత్రులను స్థానికులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారని చెప్పారు. మృతుని తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ కె.దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు


భూలక్ష్మి

జగ్గంపేట: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు ఏలేశ్వరం మండలం తిరుమాలికి చెందిన ఇంజుమళ్ల భూలక్ష్మికి జగ్గంపేట మండలం రామవరానికి చెందిన జానకి సత్యనారాయణకు ఫిబ్రవరి 2022లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. నాటి నుంచి అన్యోన్యంగా ఉన్నప్పటికీ చిన్న చిన్న సమస్యల వల్ల భూలక్ష్మి తరచు పుట్టినింటికి తిరుమాలి వెళ్లిపోయేది. జనవరి 29న తెల్లవారుజాము 3 గంటల ప్రాంతంలో భూలక్ష్మి దుస్తులు సర్దుకుని రామవరం నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల గ్రామాలలో వెతికినప్పటికి కనిపించకపోవడంతో తల్లి ఇంజుమళ్ల నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలియజేశారు. ఆచూకీ తెలిస్తే జగ్గంపేట ఎస్సై సెల్: 9440796569, స్టేషన్ నంబర్: 08852-233033కు సమాచారం తెలపాలన్నారు.

బీఎస్పీని అధికారంలోకి తీసుకురావాలి


పి.గన్నవరంలో జరిగిన సభలో మాట్లాడుతున్న పరంజ్యోతి

పి.గన్నవరం: రాబోయే ఎన్నికల్లో దేశంలోను, రాష్ట్రంలోను బహుజన సమాజ్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు అందరూ కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి అన్నారు. బహుజన రాజ్యాధికార చైతన్య యాత్రలో భాగంగా కోనసీమలోని పలు నియోజకవర్గాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బుధవారం రాత్రి పి.గన్నవరంలో జిల్లా అధ్యక్షుడు చింతా సత్య అధ్యక్షతన జరిగిన సభలో పరంజ్యోతి ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, కాపులను ఐక్యం చేసి రాజ్యాధికారం సాధించే దిశగా చైతన్యం తీసుకురావాలని అన్నారు. రాష్ట్రంలో జనవరి 26న ప్రారంభమైన ఈ యాత్ర ఈ నెల 19, 20 తేదీల్లో అన్నమయ్య జిల్లాలో ముగుస్తుందని ఆయన వివరించారు. బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్తలు లకే రాజారావు గుమ్మపుచిత్ర శ్రీను, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బత్తుల రాజారావు, జిల్లా ఇన్‌చార్జిలు కాండ్రేగుల నర్సింహం, కె.లక్ష్మీ భవాని, పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి కుసుమ వెంకటేశ్వరరావు, కె.శివశంకర్, కోలా త్రిమూర్తులు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఇన్నోవా హైక్రాస్ హైబ్రీడ్ కారు ఆవిష్కరణ


కారును ప్రారంభిస్తున్న ఆర్‌టీవో సంపత్, ఆడిటర్ భాస్కరరామ్

ప్రకాశం నగర్(రాజమహేంద్రవరం): ఇన్నోవా హైక్రాస్ హైబ్రీడ్ వెర్షన్ (సెల్ఫ్ చార్జ్‌డ్) కారును పృథ్వీ టయోటా సంస్థ బుధవారం సాయంత్రం స్థానిక జైలు రోడ్డులోని షోరూంలో ఆవిష్కరించారు. ఆర్‌టీవో సంపత్, ప్రముఖ ఆడిటర్ భాస్కరరామ్, సంస్థ చైర్మన్ ఎం.రమేష్ బాబు, సీఈవో పృథ్వీ జ్యోతి ప్రజ్వలన చేసి కారు అమ్మకాలను ప్రారంభించారు. మొదటి కారును సోమసుందర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ జనరల్ మేనేజర్ విజయ్ మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారిగా రాజమహేంద్రవరంలో అత్యాధునిక హంగులతో కూడిన ఇన్నోవా హైబ్రీడ్ వెర్షన్‌లో సెఫ్టీ సెన్స్ సిస్టమ్‌తో పాటు ఏడు ఎయిర్ బ్యాగ్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. పెట్రోల్ వెర్షన్‌లో కారు ప్రారంభ ధర రూ.18,30,000, హైబ్రీడ్ వెర్షన్‌లో రూ. 24,01,000 ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ సెల్స్ మేనేజర్ వంశీ పాల్గొన్నారు.

తిమ్మాపురం పోలీస్‌స్టేషన్‌కు శంకుస్థాపన


తిమ్మాపురం పోలీసుస్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు తదితరులు

కాకినాడ రూరల్: తిమ్మాపురం నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. 22 సెంట్ల ప్రభుత్వ స్థలంలో, సీఎస్సార్, ఎంపీ నిధులు సుమారు రూ.60 లక్షలతో ఈ నూతన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ అధునాతన సౌకర్యాలతో ఈ స్టేషన్‌ను నిర్మిస్తున్నట్టు తెలిపారు. నిధులు సమీకరించినందుకు ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీ గీత మాట్లాడుతూ మహిళల శాంతి భద్రతకు ఎస్పీ పెద్దపీట వేస్తున్నారని, దిశ యాప్‌ను జిల్లాలో అత్యధికంగా డౌన్‌లోడ్ చేయించడంతో పాటు ఉమెన్ డ్రాప్ ఎట్ హోం కార్యక్రమాలతో పోలీసుల పనితీరు మెరుగ్గా ఉందన్నారు. ఎమ్మెల్యే కురసాల మాట్లాడుతూ మూడు నెలల్లో భవన నిర్మాణం జరిగేలా సహకారం అందిస్తామన్నారు. ఈ భవనం ప్లాన్‌లో కొన్ని మార్పులను ఆయన సూచించారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, ఎస్‌బీ డీఎస్పీ అంబికా ప్రసాద్, డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ కె.శ్రీనివాస్, తిమ్మాపురం ఎస్సై నాగార్జునరాజు తదితరులు పాల్గొన్నారు.